కర్ణాటక రెబెల్ నేత ఈశ్వరప్పపై బీజేపీ వేటు

బెంగళూరు: కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి కేఎస్ ఈశ్వరప్పకు బీజేపీ షాక్ ఇచ్చింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి, లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నందుకు ఆయనను పార్టీ నుంచి ఆరేండ్లపాటు బహిష్కరిస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. ఆయన గతంలో రాష్ట్ర బీజేపీ శాఖ అధ్యక్షుడిగా కూడా పని చేశారు. హవేరీ నుంచి పోటీ చేయడానికి తన కుమారుడు కేఈ కంతేష్‌కు బీజేపీ టికెట్ దక్కకపోవడానికి కారణం బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బీవై విజయేంద్ర, ఆయన తండ్రి బీఎస్ యెడియూరప్ప అని ఈశ్వరప్ప ఆరోపిస్తున్నారు. శివమొగ్గ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీవై రాఘవేంద్రను బీజేపీ నిలిపింది. ఇదే నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఈశ్వరప్ప పోటీ చేస్తున్నారు. దీంతో ఈశ్వరప్పపై బీజేపీ వేటు వేసింది.

సూరత్‌లో దలాల్!

మొదటిపేజీ తరువాయి...

నలుగురు స్వతంత్రులు, మూడు స్థానిక పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు బీఎస్పీ నుంచి పోటీలో నిలబడ్డ ప్యారేలాల్ భారతి కూడా తన పేపర్స్‌ను విత్‌డ్రా చేసుకోవడం గమనార్హం. ఇక బరిలోని కాంగ్రెస్ అభ్యర్థి నీలేశ్ కుంభని దాఖలు చేసిన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి ఆదివారం తిరస్కరించారు. కుంభనికి ప్రత్యామ్నాయంగా అదే కాంగ్రెస్ నుంచి నిలబడ్డ డమ్మీ అభ్యర్థి సురేశ్ పదసాలా దాఖలు చేసిన నామినేషన్‌ను కూడా చెల్లనిదిగా ప్రకటించారు. కుంభని, పదసాలా సమర్పించిన నామినేషన్లపై ప్రతిపాదకుల సంతకాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని, నామినేషన్ దాఖలు సమయంలో ప్రతిపాదకులు హాజరు కూడా కాలేదని రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు. అందుకనే వాటిని తిరస్కరించినట్టు వెల్లడించారు. దీంతో బరిలో నిలిచిన ఏకైక అభ్యర్థి దలాల్‌ను విజేతగా ప్రకటించారు.

సీనియర్ నేత జైరామ్ రమేశ్ మండిపడ్డారు.

మ్యాచ్ ఫిక్సింగ్

బీజేపీ అభ్యర్థి ఏకగ్రీవ ఎన్నికపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ మండిపడ్డారు. భారత ఎన్నికల ప్రక్రియకు, రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ముప్పు పొంచి ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్నో మ్యాచ్ ఫిక్సింగ్‌గా అభివర్ణించారు. చివరి రోజున అనూహ్యంగా అందరూ బరిలో నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించడం, కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించడం కుట్రగా కనిపిస్తున్నదని సోషల్‌మీడియాలో పలువురు కామెంట్లు పెట్టారు.

సార్వత్రిక, ఉప ఎన్నికల్లో ఎంపీల ఏకగ్రీవం ఇలా..

1951	5
1957	7
1962	3
1967	5
1971	1
1977	2
1980	1
1989	1
2024	1
ఉప ఎన్నికల్లో	9

ఏకగ్రీవం చరిత్ర ఇలా..

ప్రజాప్రతినిధులు ఏకగ్రీవమవ్వడమనేది గతంలో కూడా జరిగింది. 1951ఎన్నికల నుంచి ఇప్పటివరకూ 35 మంది ఎంపీలు, 298 మంది ఎమ్మెల్యేలు ఏకగ్రీవమయినట్టు గణాంకాలు చెప్తున్నాయి. జమ్ముకశ్మీర్ నుంచి అత్యధికంగా నలుగురు ఎంపీలు, నాగాలాండ్ నుంచి ఏకంగా 77 మంది ఎమ్మెల్యేలు ఏకగ్రీవమయ్యారు. ఎంపీగా ఏకగ్రీవమైన వారిలో మాజీ ఉప ప్రధాని వైబీ చవాన్ (నాసిక్), ఫరూఖ్ అబ్దుల్లా (శ్రీనగర్), టీటీ కృష్ణమాచారి (తిరుచెందూర్), మాజీ కేంద్రమంత్రులు పీఎం సయీద్ (లక్షద్వీప్), కేఎల్ రావు (విజయవాడ), ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ సతీమణి డింపుల్ యాదవ్ (కన్నౌజ్) వంటి ప్రముఖులు ఉన్నారు.

వాట్ ఈజ్ దిస్.. మోదీ?

- ఎన్నికల వేళ విద్వేష ప్రసంగాలు
- ప్రతిపక్షాలే లక్ష్యంగా తీవ్ర వ్యాఖ్యలు
- మతాల పేరిట ఓట్లు దండుకొనే కుట్ర
- ఓటమి భయంతోనే: నెటిజన్లు

జాతి సంపదపై మొదటి హక్కు ముస్లింలదే అని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చెప్పారు. అర్బన్ నక్సలిజం మనస్తత్వం కలిగిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మన తల్లులు, చెల్లెళ్ల మంగళ సూత్రాలను కూడా వదలరు. దేశ సంపద నంతా చొరబాటుదారులకు, ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి (ముస్లింలకు) పంచుతారు. ఇది మీకు సమ్మతమేనా?

- ఆదివారం రాజస్థాన్‌లోని జాలోర్ ఎన్నికల ప్రచారంలో మోదీ

అధికారంలోకి వచ్చాక ప్రజల వద్ద ఉన్న బంగారం సహా సంపద నంతా సర్వే చేసి అందరికీ సమంగా పునఃపంపిణీ చేస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పింది. అంటే మన అక్కా-చెల్లెళ్లు, తల్లుల మంగళ సూత్రాలను దోచుకొనేందుకు వాళ్లు చట్టాలను కూడా మార్చేస్తారు. ఎవరికైనా రెండు ఇండ్లు ఉంటే, ఒక ఇంటిని లాగేసుకొంటారు. ఎన్నో దేశాలను నాశనం చేసిన ఈ విధానాలు మనకు కావాలా?

- సోమవారం యూపీలోని అలీగఢ్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: 'హ్యాట్రిక్ విజయాన్ని సాధించబోతున్నామం'టూ పైకి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ లోలోపల భయపడుతున్నారా?' ఫేస్‌బుక్‌లో ఓ నెటిజన్ ప్రశ్న. 'పదేండ్ల తమ పాలనకు రెఫరెండమ్‌గా మారిన ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తమ పార్టీకి తప్పకుండా బుద్ధి చెప్తారని మోదీకి ముందే తెలుసా? అందుకే, ప్రచార సభల్లో ప్రధానిన్నన్న విషయాన్ని కూడా మరిచిపోయి విద్వేషపూరితమైన వ్యాఖ్యలు చేస్తున్నారా?' ఎక్స్‌లో మరో వ్యక్తి పోస్ట్. సోషల్‌మీడియాలో ఏ వేదికను తెరిచినా ఇవే కామెంట్లు, పోస్టులు కనిపిస్తున్నాయి. దీనికి కారణం లేక పోలేదు. ఆదివారంనాడు రాజస్థాన్‌లోని జాలోర్ ఎన్నికల సభలో, సోమవారం యూపీలోని అలీగఢ్ ఎన్నికల ప్రచారంలో మోదీ చేసిన విద్వేషపూరితమైన వ్యాఖ్యలను విశ్లేషిస్తే, బీజేపీ నేతలకు ఓటమి భయం పట్టుకొన్నట్టు కనిపిస్తున్నదని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

చెప్పడానికి ఏమీ లేకనే!!

ఒకవైపు మండిపోతున్న పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు, మరోవైపు ఆకాశాన్నంటిన నిత్యావసరాలు, ఇంకోవైపు తారాస్థాయికి చేరిన నిరుద్యోగం.. వెరసి పదేండ్ల బీజేపీ సర్కారు పాలనపై అన్ని వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తున్నది. నిరుద్యోగం, ధరల పెరుగుదలపై ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని లోక్‌నీతి-సీఎస్‌డీఎస్ ఇటీవల చేసిన సర్వే తేల్చి చెప్పింది. నిరుద్యోగం అతి పెద్ద సమస్యగా మారిందని ఈ సర్వేలో పాల్గొన్న 62 శాతం మంది పేర్కొనగా.. ధరల మంటతో పేద, మధ్యతరగతి బతుకులు చిన్నాభిన్నమౌతున్నాయని 71 శాతం మంది

కుండబద్దలు కొట్టారు. సరిగ్గా ఎన్నికల ముందే బయటపడ్డ ఎన్నికల బాండ్ల వివాదం బీజేపీకి పెద్ద షాక్‌నిచ్చింది. ఇక, ప్రతిపక్ష నేతలపై ఈడీ, సీబీఐ దాడులు, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వంటి ప్రముఖుల అరెస్టు, వీటితోపాటు గతంలో మణిపూర్‌లో చెలరేగిన హింస, మైనారిటీలపై కొనసాగుతున్న దాడులు, సాగుచట్టాలకు సంబంధించి రైతన్నల నిరసనలు, ప్రాణత్యాగాలు, పెద్దనోట్ల రద్దు వంటి విషయాలు.. అధికార బీజేపీ ప్రభుత్వంపై సామాన్యుల్లో తీవ్ర వ్యతిరేకతకు కారణమైంది. వెరసి గడిచిన పదేండ్లలో చెప్పుకొండామంటే గొప్ప పనులంటూ ఏమీ లేకపోవడంతోనే ప్రధాని మోదీ మతాల పేరిట విద్వేష వ్యాఖ్యలు చేస్తున్నారని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. '400 సీట్లు పక్కా!' అంటూ పైకి గప్పాలు కొడుతున్నప్పటికీ, విజయావకాశాలపై బీజేపీ నేతలకు అనుమానాలు ఉన్నట్టు మోదీ వ్యాఖ్యలను చూస్తే అర్థమవుతున్నదని పలువురు పోస్టులు పెడుతున్నారు.

నియంతృత్వం దిశగా భారత్!

అంతర్జాతీయ మీడియా సంస్థల్లో కథనాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, దేశం నియంతృత్వం దిశగా సాగుతున్నదని అంతర్జాతీయ మీడియా సంస్థల్లో కథనాలు భారీగా వస్తున్నాయి. ఇటీవలి కాలంలో ది ఇండిపెండెంట్, ది వీక్, యూకే గార్డియన్, న్యూయార్క్ టైమ్స్, బ్లూమ్‌బర్గ్, రాయిటర్స్, ఫైనాన్షియల్ టైమ్స్ వంటి మీడియా సంస్థలు వివిధ కోణాల్లో కథనాల ద్వారా భారత్‌లోని పరిస్థితులపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశాయి. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించే ఆ దేశానికి చెందిన పత్రిక 'హారెట్జ్' తాజాగా ఓ కథనం ఇచ్చింది. ప్రధాని మోదీ హయాంలో భారత్ క్రూరమైన నియంతృత్వం దిశగా సాగుతున్నదని తీవ్ర విమర్శలు చేసింది. భారత్‌లో నెలకొన్న పరిస్థితులకు సంబంధించి ఇటీవలి పలు మీడియా సంస్థల హెడ్‌లైన్స్‌ను మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు మీడియా సలహాదారుగా పనిచేసిన పంకజ్ పచౌరి ఆదివారం తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. మోదీ పాలనలో భారత్‌లో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని న్యూయార్క్ టైమ్స్ పేర్కొన్నది. భారత్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నదని, నియంతృత్వంలోకి జారుకుంటున్నదని 'నిప్పాన్ జపాన్' విమర్శించింది. విపక్షాలను, వ్యతిరేక తను అణచివేసేందుకు అధికార బీజేపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నదని ది ఇండిపెండెంట్ పేర్కొన్నది. భారత్‌లో చట్టాలు ఏమయ్యాయంటూ ది అట్లాంటిక్ మ్యాగజైన్ కథనం ఇచ్చింది. మోదీ నేతృత్వంలోని హిందూ జాతీయవాద ప్రభుత్వం పౌర హక్కులపై దాడులను తీవ్రతరం చేసిందని యూకే గార్డియన్ విమర్శించింది. ప్రజాస్వామ్యానికి తల్లి వంటి భారతదేశంలో పరిస్థితులు ఘోరంగా ఉన్నాయని ఫైనాన్షియల్ టైమ్స్ అభిప్రాయపడింది. మోదీ విధానాలను ప్రగతిశీల దక్షిణాది రాష్ట్రాలు తిరస్కరిస్తున్నాయని బ్లూమ్‌బర్గ్ ఓ కథనం ఇచ్చింది.

ఈసీ మౌనం

- ప్రధానమంత్రి వ్యాఖ్యలపై గప్‌చుప్
- స్పందించేందుకు నిరాకరించిన కేంద్ర ఎన్నికల సంఘం
- చర్యలు తీసుకోవాలంటూ ప్రతిపక్ష రాజకీయ పార్టీల పట్టు
- గతంలో మతంపేరిట ఓట్లడిగిన శివసేన నేత బాల్‌ఠాక్రేపై ఈసీ వేటు
- ఆరేండ్లు ఓటింగ్‌కు, పోటీకి దూరంచేస్తూ ఆంక్షలు
- మోదీపై చర్యలెందుకు తీసుకోరని నెటిజన్ల ప్రశ్న



న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: రాజస్థాన్ ఎన్నికల ప్రచారంలో ముస్లింలను లక్ష్యంగా చేసుకొని ప్రధాని మోదీ చేసిన విద్వేషపూరిత వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. ప్రధాని వ్యాఖ్యలు ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకే వస్తాయని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. అయితే ఈ వ్యవహారంపై స్పందించడానికి ఎన్నికల కమిషన్ (ఈసీ) సోమవారం నిరాకరించింది. 'నో కామెంట్' అంటూ ఎన్నికల కమిషన్ అధికార ప్రతినిధి సమాధానమివ్వడం గమనార్హం. మరోవైపు, ప్రధాని వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. ఈసీ మార్గదర్శకాలను ఉల్లంఘించినందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రతినిధుల బృందం సోమవారం ఈసీని కలిసింది. ప్రజల్లో విభజన తీసుకొచ్చే విధంగా ఒక మతాన్ని లక్ష్యంగా చేసుకొని మోదీ మాట్లాడారని కాంగ్రెస్ తన ఫిర్యాదులో పేర్కొన్నది. ఏ ప్రధాని కూడా ఈ విధమైన వ్యాఖ్యలు చేయలేదంటూ రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రధాని వ్యాఖ్యలు దారుణమైనవి. ఎన్నికల కమిషన్ నిశ్శబ్దంగా ఉండటం మరింత దారుణం' అని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ మండిపడ్డారు. ప్రధాని వ్యాఖ్యలు దేశ వ్యతిరేకమైనవిగా కేరళ సీఎం పినరయి విజయన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అప్పుడు అలా..

మతం పేరిట ఓట్లు అడిగారంటూ శివసేన వ్యవస్థాపకుడు బాల్‌ఠాక్రేపై గతంలో పెద్దయెత్తున ఆరోపణలు వచ్చాయి. దీనిపై స్పందించిన ఎన్నికల సంఘం 1999లో ఆయనపై నిషేధం విధించింది. ఆరేండ్లపాటు ఓటేయకుండా, ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆంక్షలు విధించింది. ఇప్పుడు ఈ విషయాన్ని నెటిజన్లు గుర్తుచేస్తున్నారు. ముస్లింలను లక్ష్యంగా చేసుకొని విద్వేష పూరిత వ్యాఖ్యలు చేసిన ప్రధాని మోదీపై ఈడీ ఎందుకు నిషేధం విధించట్లే దంటూ సోషల్‌మీడియాలో నెటిజన్లు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

దీదీ వర్సెస్ మోదీ

- పశ్చిమబెంగాల్‌లో రసవత్తరంగా లోక్‌సభ ఎన్నికల పోరు
- తృణమూల్, బీజేపీ మధ్యే పోటీ
- కేంద్ర దర్యాప్తు సంస్థల వరుస దాడులతో టీఎంసీ ఉక్కిరిబిక్కిరి
- సందేశ్‌ఖాలీ, సీఏఏ, అవినీతి అంశాలను ప్రచారాస్త్రాలుగా చేసుకొన్న కమలం పార్టీ
- ఉనికి కోసం కాంగ్రెస్,లెఫ్ట్ పోరాటం

కోల్‌కతా, ఏప్రిల్ 22: పశ్చిమబెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికల పోరు రసవత్తరంగా ఉన్నది. రాష్ట్రంలో అధికార టీఎంసీ, బీజేపీ మధ్య ప్రధాన పోటీ నెలకొన్నది. పార్టీల మధ్య పోరు అనే కంటే ప్రధాని మోదీ, సీఎం మమతా బెనర్జీ మధ్యనే పోటీ అని చెప్పేలా పరిస్థితులు ఉన్నాయి. గత ఏడాది కంటే ఎక్కువ సీట్లు సాధించి మమతకు గట్టి షాక్ ఇవ్వాలనే బీజేపీ పట్టుదలగా ఉన్నది. మరోవైపు విపక్ష ఇండియా కూటమిలో ఉన్నప్పటికీ, బెంగాల్‌లో మాత్రం అన్ని స్థానాల్లో తృణమూల్ ఒంటరిగానే బరిలో నిలిచింది. కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు, ఉపాధి నిధులను కేంద్రం విడుదల చేయకపోవడం, ఆర్థిక అంశాల్లో రాష్ట్రంపై కేంద్రం వివక్ష, పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)తో జరిగే నష్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మమత ప్రయత్నిస్తున్నారు. సీఏఏ తోపాటుగా, సందేశ్‌ఖాలీ ఘటనను బీజేపీ ముఖ్యమైన ప్రచారాస్త్రాలుగా చేసుకొన్నది. రాష్ట్రంలో అవినీతి పెరిగిందని, శాంతి భద్రతలు క్షీణించాయని కమలం నేతలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్‌తోపాటు ఒకప్పుడు తమ కంచుకోటగా ఉన్న బెంగాల్‌లో ఉనికి కోసం కమ్యూనిస్టు పార్టీలు ప్రయత్నిస్తున్నాయి.

దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, సీఏఏపై మమత ప్రచారం

2026లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న వేళ.. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మమతకు చాలా కీలకం. టీఎంసీలో సీనియర్లు, జూనియర్ల మధ్య విభేదాలు ఆ పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. పలు కేసుల్లో టీఎంసీ నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు, అరెస్టులతో పార్టీ ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. సందేశ్‌ఖాలీ ఘటన కూడా ఆ పార్టీని కలవరపెడుతున్నది. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే టీఎంసీని లక్ష్యంగా చేసుకొని, తమ పార్టీ నేతలపైకి దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నదని మమత ఆగ్రహంతో ఊగిపోతున్నారు. మరోవైపు ప్రతి ఎన్నికల మాదిరిగానే వలస కార్మికులు, మైనారిటీల ఓటు బ్యాంకుపై దృష్టి పెట్టిన మమత.. సీఏఏను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. ఈ చట్టంతో చట్టబద్ధమైన పౌరులను విదేశస్తులుగా మార్చే కుట్రలు చేస్తున్నారనే విషయాన్ని ఆయా వర్గాల్లోకి తీసుకెళ్లేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్, సీపీఎంలకు ఓటేస్తే, అది బీజేపీ సహకరించినట్టేనని ప్రచారం చేస్తున్నారు.

గత సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన సీట్లు

పార్టీ	2014	2019
టీఎంసీ	34	22
బీజేపీ	2	18
కాంగ్రెస్	4	2
సీపీఎం	2	-

అసెంబ్లీ ఎన్నికలకు సెమీఫైనల్!

2019 లోక్‌సభ ఎన్నికల్లో అనూహ్యంగా రాష్ట్రంలోని 42 నియోజకవర్గాలకుగానూ 16 స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. 2014 ఎన్నికల్లో కేవలం 17 శాతం ఓట్లతో రెండు సీట్లు మాత్రమే గెలుచుకొన్న కమలం పార్టీ.. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఓటు షేర్‌ను ఏకంగా 40 శాతానికి పెంచుకోవడంతోపాటు 18 లోక్‌సభ స్థానాలను గెలుచుకొన్నది. ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో అంతకంటే మెరుగ్గా సీట్లను గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకొన్నది. తద్వారా రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికారం చేపట్టే దిశగా తీసుకెళ్లాలని కమలనాథులు ప్లాన్లు రచిస్తున్నారు.

ప్రచారాస్త్రంగా సందేశ్‌ఖాలీ

మహిళలపై లైంగిక వేధింపులు, భూఆక్రమణకు సంబంధించి టీఎంసీ నేతలు ఆరోపణలు ఎదుర్కొంటున్న సందేశ్‌ఖాలీ కేసును ప్రధాని మోదీ సహా బీజేపీ నేతలు ఎన్నికల అంశంగా మార్చి.. టీఎంసీ లక్ష్యంగా ముప్పేట విమర్శలు గుప్పిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల వేళ అమల్లోకి తీసుకొచ్చిన సీఏఏ ప్రభావం 10-12 స్థానాల్లో ఉండే అవకాశం ఉన్నదని కమలం పార్టీ భావిస్తున్నది. పలు నియోజకవర్గాల్లో గెలుపోటములపై ప్రభావం చూపే బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన మథువా, దళిత బెంగాలీ హిందువులు, పలు ఎస్సీ గ్రూపుల ఓట్లపై ఆశలు పెట్టుకొన్నది. రాష్ట్రంలో టీఎంసీ పాలనలో అవినీతి పెద్దయెత్తున పెరిగిపోయిందని బీజేపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. టీఎంసీకి రాష్ట్రంలో అభివృద్ధి కంటే అవినీతి, బంధుప్రీతి, ప్రజలను మోసగించడమే ప్రధానమని బీజేపీ నేతలు విమర్శిస్తున్నారు. హిందూత్వ అజెండాను కూడా ముందుకు తీసుకెళ్తున్నారు.

25 వేల టీచర్ల నియామకాలు రద్దు

- కలకత్తా హైకోర్టు సంచలన తీర్పు
- వేతనాలు వెనక్కి ఇవ్వాలని ఆదేశం
- కొత్త నియామక ప్రక్రియ చేపట్టాలని స్కూల్ సర్వీస్ కమిషన్‌కు స్పష్టీకరణ
- మమతా బెనర్జీ సర్కారుకు భారీ షాక్
- కోర్టు తీర్పు చట్టవిరుద్ధమన్న సీఎం
- 'సుప్రీం'లో సవాల్ చేస్తామని వెల్లడి

కోల్‌కతా/రాయ్‌గంజ్, ఏప్రిల్ 22: లోక్‌సభ ఎన్నికల వేళ పశ్చిమబెంగాల్‌లోని మమతా బెనర్జీ సర్కారు భారీ షాక్ తగిలింది. 2016లో చేపట్టిన 25,753 మంది టీచర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలను రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. అలాగే ఉద్యోగాలు పొందిన వీరంతా తమ జీతాన్ని వెనక్కి ఇచ్చేయాలని స్పష్టంచేసింది. రికవరీ బాధ్యతను కలెక్టర్లకు అప్పగించింది. నియామక ప్రక్రియపై తదుపరి దర్యాప్తు చేపట్టాలని, మూడు నెలల్లో నివేదిక అందజేయాలని సీబీఐని ఆదేశించింది. కొత్తగా రిక్రూట్‌మెంట్ చేపట్టాలని పశ్చిమబెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ)కు స్పష్టంచేసింది. 2016లో రాష్ట్ర ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. 24,640 ఖాళీల భర్తీ కోసం నిర్వహించిన ఈ పరీక్షకు 23 లక్షల మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. అయితే ఈ రిక్రూట్‌మెంట్‌లో అక్రమాలు చోటుచేసుకొన్నాయనే ఆరోపణలు వచ్చాయి. ఉన్న ఖాళీల కంటే అధికంగా 25,753 అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చారని పిటిషనర్ల తరపు న్యాయవాది ఫిర్దోస్ షమీమ్ పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు అనంతరం న్యాయస్థానం బయట వేచిచూస్తున్న వందలాది మంది అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ రోజు కోసం తాము ఏండ్లుగా ఎదురుచూస్తున్నామని, చివరకు తమకు న్యాయం జరిగిందని ఓ అభ్యర్థి పేర్కొన్నారు. కాగా, హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాల్ చేస్తామని ఎస్ఎస్‌సీ చైర్మన్ సిద్ధార్థ్ మజుందార్ తెలిపారు.

ఈ తీర్పు చట్టవిరుద్ధం: మమత

కలకత్తా హైకోర్టు తీర్పుపై పశ్చిమబెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ స్పందించారు. నియామకాలను రద్దు చేస్తూ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు చట్టవిరుద్ధమని, దీన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలోని రాయ్‌గంజ్‌లో సోమవారం ఓ ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడుతూ న్యాయ నిర్ణయాలను కూడా బీజేపీ నేతలు ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. 'అన్ని నియామకాలను రద్దు చేయడం చట్టవిరుద్ధం. ఉద్యోగాలు కోల్పోయిన వారికి అండగా ఉంటాం. న్యాయం కోసం పోరాడుతాం' అని మమత స్పష్టం చేశారు.

ఎన్నికల వేళ బీజేపీ సూచనలతోనే..

కరందిఘిలో జరిగిన మరో ర్యాలీలో మమత మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీ సూచనల మేరకు ఈ తీర్పు వచ్చిందని ఆరోపించారు. కోర్టులను బీజేపీ తన పార్టీ కార్యాలయాలుగా మార్చుకొన్నదంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. 'బీజేపీ ఒక పిల్ వేస్తే.. దానిపై వెంటనే చర్యలు తీసుకొని జైళ్లకు కూడా పంపిస్తారు. అయితే ఇతరులు పిటిషన్లు వేసినప్పుడు మాత్రం ఎలాంటి చర్యలు ఉండవు' అని అన్నారు. ఈ సందర్భంగా ఇటీవల కలకత్తా హైకోర్టు జడ్జిగా రాజీనామా చేసి, బీజేపీలో చేరిన అభిజిత్ గంగోపాధ్యాయ్ అంశాన్ని ప్రస్తావిస్తూ 'ఈ బంధం సుస్పష్టం. అందరికీ కనిపిస్తున్నది' అని మమత పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలోని ఒక వర్గం రాజీపడేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. 'బీజేపీతో సంబంధాలు ఉన్నవారికి ముఖ్యమైన పదవులు దక్కుతున్నాయి. బీజేపీ కార్యాలయాల నుంచి వచ్చిన సూచనలే తీర్పు రూపంలో వస్తున్నాయి' అని మమత ఆరోపించారు.

ఎంపీలు, ఎమ్మెల్యేలపై 2 వేల కేసుల్లో తీర్పులు

- లోక్‌సభ తొలి రెండు విడతల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల్లో 501 మందిపై క్రిమినల్ కేసులు
- సుప్రీంకు తెలిపిన అమికస్ క్యూరీ

న్యూఢిల్లీ: పార్లమెంటు, శాసనసభల సభ్యులపై నమోదైన క్రిమినల్ కేసుల్లో దాదాపు 2,000 కేసులను 2023లో ప్రత్యేక కోర్టులు పరిష్కరించాయి. సీనియర్ అడ్వకేట్ విజయ్ హన్సారియా ఓ అఫిడవిట్‌లో ఈ వివరాలను సుప్రీంకోర్టుకు తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్యేలపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులను సత్వరం పరిష్కరించాలని కోరుతూ దాఖలైన ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) విచారణలో అమికస్ క్యూరీగా విజయ్ వ్యవహరిస్తున్నారు. ఈ కేసుల్లో వేగంగా తీర్పులు రావాలంటే మరిన్ని ఆదేశాలను జారీ చేయడం అవసరమని, సంబంధిత హైకోర్టుల పర్యవేక్షణ తప్పనిసరి అని ఈ అఫిడవిట్‌లో విజయ్ తెలిపారు. లోక్‌సభ తొలి రెండు విడతల ఎన్నికల్లో పోటీ చేస్తున్న 501 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీరిలో 327 మందిపై తీవ్ర నేరారోపణలు విచారణలో ఉన్నాయని, ఈ నేరాలు రుజువైతే, వారికి కనీసం ఐదేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందని చెప్పారు. 2019లో క్రిమినల్ కేసులుగలవారే ఎక్కువ మంది ఎన్నికయ్యారని గుర్తు చేశారు. అందుకే పెండింగ్ కేసులను మరింత వేగంగా పరిష్కరించేందుకు తగిన ఆదేశాలను జారీ చేయాలని సుప్రీంకోర్టును కోరారు.

అలీగఢ్ వర్సిటీ వీసీగా నైమా ఖాతూన్

వర్సిటీ తొలి మహిళా వీసీగా ఘనత

న్యూఢిల్లీ : అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ) వైస్ చాన్స్‌లర్‌గా నైమా ఖాతూన్ నియమితులయ్యారు. వర్సిటీ 100 ఏండ్ల చరిత్రలో ఈ పదవి చేపట్టిన తొలి మహిళగా ఆమె ఘనత సాధించారు. ఆమె నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల కమిషన్ అనుమతి కూడా తీసుకున్నట్టు వర్సిటీ వర్గాలు తెలిపాయి. ఏఎంయూలో సైకాలజీలో పీహెచ్‌డీ అందుకున్న ఆమె, 5 ఏండ్లపాటు వర్సిటీ వీసీగా కొనసాగనున్నారు. 1875లో ఏర్పాటైన ముహమ్మదన్ ఆంగ్లో ఓరియెంటల్ కాలేజీ ..1920లో 'అలీగఢ్ ముస్లిం యూనివర్